

ఆన్‌లైన్‌లో
మరో మంచి అవకాశం

కొలువుల బంగారం కోడింగ్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రముఖ కళాశాలల్లోనే జరుగుతాయి. అక్కడా అందరికీ అవకాశాలేమీ లభించవు! మరి అలా అవకాశం దక్కనివారూ... అసలు నియామకాలే జరగని కాలేజీల్లో చదువుతున్నవారి మాటేమిటి? అలాంటి ఔత్సాహిక విద్యార్థులకూ కొలువుల బంగారం ఉంది! ప్రాంగణ నియామకాలు ఉన్నా, లేకున్నా వాటితో సంబంధం లేకుండా నేరుగా నియామకాలకు అవకాశం కల్పిస్తున్నవే.. కోడింగ్ కాంపిటిషన్స్! ప్రోగ్రామింగ్ నేర్చుకుని, ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోగలిగితే చాలు... ఎవరైనా సరే, ఐటీ కొలువులు కొట్టేయవచ్చు!

పరుచూరి సతీష్ చంద్ర
ప్లేస్‌మెంట్ డైరెక్టర్, బీవీఆర్ఐటీ, శ్రీవిష్ణు

తరచూ లాప్‌టాప్‌లో మొహం దూర్చి కనపడుతుంటాడు సాత్విక్. ఆన్‌లైన్లో ఏవేవో నేర్చుకుంటూ, మెదడుకు పదునుపెట్టుకుంటూ ఉంటాడు. ఓ ప్రముఖ సంస్థలో అతడికి ఉద్యోగం వచ్చిందని తెలిసి అందరూ ఆశ్చర్యపోయారు. నిజానికి తడు ఎప్పుడూ ఏ కంపెనీ నియామక పరీక్షలూ రాయలేదు. కోడింగ్ కాంపిటిషన్లలో పాల్గొనటం, సాంకేతికంగా చూపిన ప్రతిభ, సంపాదించిన అనుభవం వల్లనే ఈ చక్కటి అవకాశం అతడికి లభించింది!

కోడింగ్ పోటీలు కొద్ది కాలం క్రితం ఆరంభమయ్యాయి. ఇప్పుడిప్పుడే విద్యార్థుల్లో వీటిపై అవగాహన పెరుగుతోంది.

ఒకప్పుడు ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మాత్రం ఉంటే ఉద్యోగం సులువుగా వచ్చేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇంజినీరింగ్ చదివేవారికి వారి బ్రాంచితో సంబంధం లేకుండా ప్రోగ్రామింగ్‌లో పట్టు ఉండటం చాలా ముఖ్యం. అప్పుడే వారికి ఉద్యోగార్హత నైపుణ్యం ఉన్నట్టు.

ప్రోగ్రామింగ్‌ను నేర్చుకోవడం అనేది కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లకో, ఇంజినీర్లకో మాత్రమే పరిమితమైనది కాదు. సాంకేతికపరమైన కంపెనీల్లో ఉద్యోగం కావాలనుకునే సాధారణ గ్రాడ్యుయేట్లు గానీ, వివిధ ఇంజినీరింగ్ బ్రాంచీల వారు గానీ ప్రోగ్రామింగ్‌ను ఎంచక్కా నేర్చుకోవచ్చు. కేవలం ప్రోగ్రామింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా తమ అభిరుచి మేరకు అభ్యసించవచ్చు.

సాధారణ ఇంజినీర్లతో పోలిస్తే మంచి ప్రోగ్రామర్లను రెండు రెట్లు అదనంగా వేతనం ఇచ్చి కంపెనీలు నియమించుకుంటుంటాయి. కోడింగ్ పరిజ్ఞానంపై పట్టున్నవారికి ఉద్యోగాలు ఇవ్వటానికి టెక్నాలజీ కంపెనీలూ, స్టార్టప్ సంస్థలూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. కోడింగ్ పోటీల్లో పాల్గొనే ప్రతిభావంతుల నుంచి ఎంచుకోవటం వారికి సులువు అవుతోంది.

మారుమూల ప్రాంతాల్లో ఉండే సాధారణ కళాశాలల విద్యార్థులకు ప్రోగ్రామింగ్ అంటే కొంత భయం ఉంటుంది. తమ కళాశాలల్లో కొంత నేర్చుకున్నా అంతకుమించి ఉన్నత స్థాయిలో నేర్చుకునే అవకాశం ఆన్‌లైన్లో లభిస్తోంది. ఎలాంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అయినా నేర్చుకుని కోడింగ్ పోటీలో ఉచితంగా పాల్గొనవచ్చు; పాయింట్లు పెంచుకోవచ్చు. మంచి ప్రతిభ చూపిస్తే ఉద్యోగం వస్తుంది. ఒకవేళ వెంటనే రాకపోయినా సాధించిన సాంకేతిక ప్రతిభ కెరియర్‌కు ఎంతో ఉపయోగపడుతుంది.

గూగుల్ నుంచి ఫేస్‌బుక్ వరకూ అన్ని ప్రముఖ టెక్ కంపెనీలూ, స్టార్టప్ సంస్థలూ ప్రతిభావంతులైన యువ కోడర్‌లను నియమించుకోవడానికి పోటీ పడుతున్నాయి.

ఎలా నేర్చుకోవచ్చు?

కోడింగ్ స్వతంత్రంగా నేర్చుకునేందుకు ఎన్నో మార్గాలున్నాయి. కోడ్ రాయటం బోధించే వెబ్‌సైట్లు చాలానే ఉన్నాయి. ప్రాథమిక అంశాల నుంచి (బేసిక్స్) ఆరంభించి అభ్యసించటానికి అత్యుత్తమ వేదికలు.. www.code.org, www.khanAcademy.com

ఈ మధ్య తరచూ విన్పిస్తున్న మాట కాంపిటిటివ్ కోడింగ్. విద్యార్థుల కెరియర్‌కు కోడింగ్ బాగా ఉపకరిస్తుంది. ఒక సమస్యకు సరళమైన పరిష్కారం నుంచి బహుళ పరిష్కారాల వరకూ రాసే సామర్థ్యం దీనికి అవసరం.

నియమిత సమయంలో అత్యంత సరైన పరిష్కారాన్ని పోటీ ధోరణితో రాయటమే కాంపిటిటివ్ కోడింగ్! ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు 20-30 అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏ లాంగ్వేజ్‌లో అయినా ప్రోగ్రామింగ్ రాయొచ్చు.

ఎందుకంత ప్రాముఖ్యం?

వివిధ కార్యకలాపాలకు ఆటోమేషన్‌ను వినియోగిస్తున్నారు. ఈ కారణం వల్ల కంపెనీలు తమ అవసరాలకు మించి అదనంగా ఉండే సిబ్బందిని తగ్గించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ కంపెనీలూ, స్టార్టప్ సంస్థలూ ఏ స్థాయి నియామకాలనైనా (ఇంటర్న్, ఫ్రెషర్, టీమ్స్‌లో సీనియర్ మెంబర్) అత్యంత ముఖ్యమైన నైపుణ్యంగా కోడింగ్‌ను పరిగణిస్తున్నాయి.

ఉత్తమ కోడర్ అవ్వాలంటే?

దీనికి కోడింగ్ వెబ్‌సైట్లలో ముఖ్యాంశాలు నేర్చుకోవాలి. ఒక సైట్‌ను ఎంచుకుని, పునాది నుంచి నేర్చుకోవాలి. ప్రతిరోజూ కనీసం ఒక ప్రోగ్రామ్ రాయాలి. ప్రాథమిక ప్రోగ్రాముల నుంచి ఉన్నత స్థాయికి పెంచుకుంటూ 500 నుంచి 1000 సమస్యలకు ప్రోగ్రాములు రాయటం ముఖ్యం.

కోడింగ్ వెబ్‌సైట్లు....

www.hackerrank.com, www.hackerearth.com, www.codechef.com, www.codenations.com, www.topcoder.com, www.codeforces.com

❑ 30 రోజుల్లో కోడ్ నేర్చుకోవడం లాంటి ప్రోగ్రాములు www.hackerrank.com /domains/tutorials/30-days-of-code లో ఉన్నాయి. ❑ కోడింగ్, కంప్యూటర్ సైన్స్‌లకు సంబంధించి ఎన్నో ప్రశ్నలకు ఒకే చోట జవాబులు దొరికే వెబ్‌సైట్ www.geeksforgeeks.org/

ఎన్నో ఉద్యోగాలు

కోడింగ్ పోటీ అయిన CodeVita ద్వారా ప్రతి సంవత్సరం సుప్రసిద్ధ సంస్థ టీఎస్ఎస్ 1000 మంది తాజా ఇంజినీర్లను నియమించుకుంటోంది. ఏ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయినా దీనిలో పాల్గొనవచ్చు. టీసీఎస్‌కు సంబంధించి EnQuode, EngiNX మొదలైన ఇతర పోటీలు కూడా ఉన్నాయి.

ఇన్ఫోసిస్‌కు కూడా #HackwithInfy అనే కోడింగ్ కాంపిటిషన్ (హ్యాకథాన్) ఉంది. ఎంపిక చేసిన ఇంజినీరింగ్ కళాశాలల్లోనే ఇది అందుబాటులో ఉంటుంది. ఈ పోటీ ద్వారా ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్లను అందిస్తుంటారు.

వేదికల ఉపయోగాలేమిటి?

www.codechef.com, www.topcoder.com, www.codeforces.com లాంటి కోడింగ్ వేదికలు క్రమం తప్పకుండా కోడింగ్ పోటీలను నిర్వహిస్తుంటాయి. సరికొత్త సమస్యలతో ఇలాంటి పోటీలు జరుగుతుంటాయి. కోడింగ్ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకునే, కాంపిటిటివ్ కోడింగ్ విషయాల్లో ఈ పోటీలు చాలా మేలు చేస్తాయి.

www.hackerearth.com అనేది కోడింగ్‌కూ, నియామకాలకూ చక్కటి వేదిక.

www.techgig.com సైట్ 'కోడ్ గ్లాడియేటర్స్'ను నిర్వహిస్తుంది. దీనిలోని పోటీదారుల నుంచి నియామకాలు చేసుకోవటానికి వివిధ కంపెనీలకు ఉపకరిస్తుంది.

కాంపిటిటివ్ కోడ్ నేర్చుకోదల్చినవారికి కోడ్ చెఫ్ 'కోడ్ చెఫ్ సర్టిఫైడ్ డేటా స్ట్రక్చర్ అండ్ అల్గారిదమ్ ప్రోగ్రామ్'ను మూడు దశల్లో నిర్వహిస్తోంది. ఇది విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుంది. www.codechef.com / certification

అన్ని సైట్లూ తమ వేదికల్లో కోడ్ పోటీల్లో పాల్గొనటానికి ఎలాంటి రుసుమునూ కోరటం లేదు. అన్నీ ఉచితమే.

ఇంజినీరింగ్ విద్యార్థులు తమ బ్రాంచితో సంబంధం లేకుండా మొదటి సంవత్సరంలో చేరిన దగ్గర్నుంచీ ఫైనలియర్ వరకూ ఈ కోడింగ్ పరిజ్ఞానం పెంచుకుని, పోటీల్లో పాల్గొనవచ్చు. వీటిపై ఎంత సమయం వెచ్చించి ప్రోగ్రాములు రాయటంపై పట్టు సాధిస్తే.. అంత కెరియర్‌కు ఉపయోగం. ఇంటర్న్‌షిప్‌లకూ, ఉద్యోగాలకూ ఈ అనుభవం చాలా సహాయపడుతుంది.

ఏం కావాలి?

- సి/సి++/పైథాన్/జావా/ జావా స్క్రిప్ట్/ కోట్లిన్/సి# మొదలైన ఏ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అయినా తెలిసివుండాలి.
- మ్యాథమేటికల్ ప్రాబ్లమ్స్‌కు పరిష్కారాలు రాయటం నుంచి ప్రోగ్రామింగ్ ఉపయోగించటం వరకూ తెలిసుండాలి. sprojecteuler.net)
- డేటా స్ట్రక్చర్స్‌పై అవగాహన ఉండాలి.
- అల్గారిదమ్స్ తెలిసివుండాలి.
- కాన్సెప్టును ప్రోగ్రామింగ్‌కూ/కోడింగ్‌ను అత్యుత్తమ పరిష్కారానికీ అన్వయించగలగాలి.
- కోడ్.ఆర్గ్, ఖాన్ అకాడమీ, కోడ్‌అకాడమీ.కామ్‌ల నుంచి కోడింగ్ నేర్చుకోవచ్చు.

ఇతర పోటీలు

'గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్' అనేది ప్రాజెక్టు ఆధారిత పోటీ. దీనిలో విజయం సాధిస్తే గూగుల్ సంస్థ 5500 డాలర్ల స్టైపెండ్ అందిస్తుంది.

✦ 'గూగుల్ కోడ్ జామ్' అంతర్జాతీయ ప్రోగ్రామింగ్ పోటీ. దీన్ని గూగులే నిర్వహిస్తుంది. అత్యంత సాంకేతిక ప్రతిభాసంపత్తి ఉన్న ఇంజినీర్లను గుర్తించి, తమ సంస్థలోకి ఆకర్షించటానికి దీన్ని 2003లో ఆరంభించారు.

✦ 'అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మెషినరీ- ఇంటర్నేషనల్ కలిజియేట్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్' ప్రతిష్ఠాత్మకమైన పోటీ. వివిధ పోటీల్లో పాల్గొని మంచి అనుభవం సంపాదించినవారికి ఈ ఏసీఎం-ఐసీపీసీ మంచి వేదిక.

నోటీస్ బోర్డు

వ్యాప్‌కోస్ లిమిటెడ్

వాక్ ఇన్స్

కోల్‌కతాలోని వ్యాప్‌కోస్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **పోస్టులు:** టీం లీడర్, సీనియర్/ జూనియర్ ఇంజినీర్, సర్వేయర్, సివిల్/ఎలక్ట్రికల్ ఇంజినీర్, సేఫ్టీ అండ్ లేబర్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితరాలు. **ఖాళీలు:** 96. **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం తప్పనిసరి. **ఇంటర్వ్యూ తేదీలు:** జులై 7, 8. **వేదిక:** వ్యాప్‌కోస్ లిమిటెడ్, జలసంపద్ భవన్, కోల్‌కతా. www.wapcos.gov.in

ఆంగ్రూలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులు.

పోస్టు-ఖాళీలు: యంగ్ ప్రొఫెషనల్- 03, మెటిరియలాజికల్ అబ్జర్వర్- 01. **అర్హత:** ఇంటర్ (బైపీసీ), సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత, పని అనుభవం. **వయసు:** 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి. ఇంటర్వ్యూ తేదీ: 10.07.2018. **వేదిక:** అగ్రికల్చరల్ రిసెర్చ్ స్టేషన్, రేకులకుంట, బుక్కరాయసముద్రం, అనంతపురం జిల్లా. www.angrau.ac.in

ఐఐవోఆర్‌లో ప్రాజెక్ట్ ఫెలో ఖాళీలు

హైదరాబాద్‌లోని ఐకార్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రిసెర్చ్ (ఐఐవోఆర్)లో తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు.

ఖాళీలు: సీనియర్ రిసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)- 03, ప్రాజెక్ట్ అసిస్టెంట్- 02

అర్హత, వయసు: సంస్థ నిబంధనల ప్రకారం. **ఇంటర్వ్యూ తేదీలు:** జులై 10, 17.

వేదిక: ఐఐవోఆర్, రాజేంద్రనగర్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** www.icar-iior.org.in

ప్రవేశాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కింది ప్రవేశపరీక్షల శిక్షణలో ప్రవేశాలకు షెడ్యూలు కులాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-2018 ఇంటెన్సివ్ లాంగ్ టర్మ్ కోచింగ్ 2. ఐఐటీ లాంగ్ టర్మ్ కోచింగ్

అర్హత: ఇంటర్, ఎంసెట్, జేఈఈలలో తగిన ఉత్తీర్ణతా శాతం సాధించి ఉండాలి. ఈ ప్రకటనకు సంబంధించిన వివరాలు సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో జులై 5 నుంచి అందుబాటులో ఉంటాయి.

వెబ్‌సైట్: www.tswreis.telangana.gov.in

నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్

నాగ్‌పుర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజీలో బీఈ (ఫైర్ ఇంజినీరింగ్) ప్రోగ్రాం ప్రవేశాలు. **సీట్ల సంఖ్య:** 60.

అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్, కెమిస్ట్రీ/ బయోటెక్నాలజీ/ బయాలజీ/ టెక్నికల్ వొకేషనల్ సబ్జెక్టుల్లో హయ్యర్ సెకండరీ ఉత్తీర్ణత. జేఈఈ (మెయిన్)-2018లో సీఆర్ఎల్ ర్యాంకు (పేపర్-1) పొంది ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేదీ: 08.07.2018.

వెబ్‌సైట్: http://nfscnagpur.nic.in/

అప్రెంటిస్‌షిప్

ఆగ్నేయ మధ్య రైల్వేలో ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీలు

ఆగ్నేయ మధ్య రైల్వే(ఎస్ఈసీఆర్)కు చెందిన బిలాస్‌పూర్ డివిజన్‌లో ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు.

శిక్షణ కాలం: ఏడాది. **ఖాళీలు:** 432.

ట్రేడులు: సీవోపీఏ, స్టెనోగ్రాఫర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్, పెయింటర్, కార్పెంటర్ తదితరాలు.

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత.

వయసు: 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: విద్యార్హత మార్కుల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 31.07.2018 **వెబ్‌సైట్:** www.secr.indianrailways.gov.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

అత్యున్నత బ్యాంకులో అధికారి

ఆర్‌బీఐ విధివిధానాల రూపకల్పన వాటి అమలులో కీలకపాత్ర పోషించే గ్రేడ్-బి ఆఫీసర్ ఉద్యోగాలకు ప్రకటన వెలువడింది. సామాజిక, ఆర్థికాంశాలపై పట్టు, ఆంగ్లపరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు అత్యున్నత బ్యాంకులో ఉద్యోగం సాధించేందుకు మంచి అవకాశం వచ్చింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 166 ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో రెండు దశల్లో నిర్వహించే పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. డిగ్రీ అర్హతతో వీటికి పోటీ పడవచ్చు. ఎంపికైనవారికి నెలకు రూ.75 వేలకు పైగా వేతనం అందుతుంది. ప్రకటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకుందాం.

విద్యార్హతలు

డీఆర్ (జనరల్) పోస్టులు: 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 50 శాతం) దీంతోపాటు ఇంటర్/ డిప్లొమా, పదోతరగతిలోనూ 60 శాతం మార్కులు సాధించాలి.

డీఆర్ (డీఈపీఆర్) పోస్టులు: కనీసం 55 శాతం మార్కులతో ఎకనామిక్స్, ఫైనాన్స్ సంబంధిత కోర్సుల్లో పీజీ ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 50 శాతం మార్కులు.

డీఆర్ (డీఎస్ఐఎం) పోస్టులు: స్టాటిస్టిక్స్/ మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/ మ్యాథమేటికల్ ఎకనామిక్స్/ ఎకనామెట్రిక్స్/ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ (ఐఐటీ ఖరగ్‌పూర్) / అప్లైడ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ (ఐఐటీ బాంబే) వీటిలో ఏదైనా కోర్సులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత లేదా 55 శాతం మార్కులతో మ్యాథ్స్‌లో పీజీతోపాటు కనీసం ఏడాది వ్యవధి ఉండే పీజీ డిప్లొమా ఇన్ స్టాటిస్టిక్స్ కోర్సు పూర్తి చేయాలి. లేదా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎస్టాట్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి. లేదా ఐఎస్ఐ కోల్‌కతా, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐఎం కోల్‌కతా ఈ మూడు సంస్థలూ కలిసి అందిస్తోన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును కనీసం 55 శాతం మార్కులతో పూర్తిచేయాలి.

ఆర్‌బీఐ నుంచి 166 గ్రేడ్-బీ ఆఫీసర్ పోస్టులు

వయసు: జులై 1, 2018 నాటికి 21 - 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. అంటే జులై 2, 1988 కంటే ముందు; జులై 1, 1997 తర్వాత జన్మించినవాళ్లు అనర్హులు. ఎంఫిల్ పూర్తి చేసిన వారికి 32 ఏళ్లు, పీహెచ్‌డీ అభ్యర్థులకు 34 ఏళ్లు గరిష్ఠ వయసు. బోధనలో అనుభవం ఉన్నవారికి మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు వయసు సడలింపు వర్తిస్తుంది.

గ్రేడ్-బి డీఆర్ (జనరల్) ఉద్యోగాలకు రెండు దశల్లో పరీక్షలు

ఫేజ్-1: పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ తరహాలో 200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు.

అభ్యర్థులు తర్వాతి దశ (ఫేజ్-2)కు ఎంపిక కావాలంటే ఫేజ్-1లో ప్రతి సెక్షన్ నుంచి కనీస కటాఫ్ మార్కులను సాధించాలి. అలాగే అన్ని సెక్షన్లూ కలిపి కనీస మార్కులు సాధించాలి. ఆయా విభాగాల్లో ఖాళీలకు అనుగుణంగా మెరిట్ ప్రాతిపదికన తర్వాతి దశకు ఎంపిక చేస్తారు. ఫేజ్-1 నిర్వహించిన వారం రోజుల తర్వాత ఆర్బీఐ వెబ్‌సైట్‌లో ఫలితాలు వెల్లడిస్తారు.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: జులై 3

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జులై 23

ఫేజ్-1 పరీక్ష తేదీ: ఆగస్టు 16

ఫేజ్-2 పరీక్ష తేదీ: జనరల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి సెప్టెంబరు 7. డీఈపీఆర్, డీఎస్ఐఎం పోస్టులకు సెప్టెంబరు 6 లేదా 7.

ఫేజ్-2: ఈ పరీక్ష కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. మొత్తం 3 పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్ 90 నిమిషాల వ్యవధితో 100 మార్కులకు ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. పేపర్-1లో ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్‌పై ప్రశ్నలు ఇస్తారు. పేపర్-2 ఇంగ్లిష్ రైటింగ్ స్కిల్స్‌పై డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. పేపర్-3 ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌పై ఉంటుంది. ఇంగ్లిష్ పేపర్ మినహా మిగిలిన ప్రశ్నపత్రాలన్నీ ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి.

ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఇంటర్వ్యూలో సమాధానాలు చెప్పవచ్చు. ఫేజ్-2 రాతపరీక్ష, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కుల ఆధారంగా తుది నియామకాలు చేపడతారు.

వేతన శ్రేణి: రూ.35150 - రూ.62400. డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు కలిపి ఆరంభంలోనే నెలకు రూ.75 వేలకు పైగా పొందుతారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఫేజ్-1 పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కాకినాడ, తిరుపతి, చీరాల, కర్నూలు, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్.

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.వంద; మిగిలిన అందరికీ రూ.850. www.rbi.org.in